సికింద్రాబాద్ సర్కిల్ ఏసీపీగా పావని



ఎమ్మెల్యే పద్మారావుగౌడ్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన ఏసీపీ పావని

సికింద్రాబాద్: జీహెచ్‌ఎంసీ సికింద్రాబాద్ సర్కిల్ అసిస్టెంట్ టౌన్‌ప్లానర్‌గా గంగవరపు పావని నియమితులయ్యారు. సర్కిల్ కార్యాలయానికి మంగళవారం వచ్చిన పావని బాధ్యతలు స్వీకరించారు. అనంతరం సీతాఫల్‌మండిలోని క్యాంపు కార్యాలయానికి వచ్చిన ఆమె స్థానిక ఎమ్మెల్యే తీగుళ్ల పద్మారావుగౌడ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. కార్వాన్ సర్కిల్ నుంచి సికింద్రాబాద్‌కు ఆమె బదిలీపై వచ్చారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ న్యాక్ ఇంజినీర్ ప్రకాశ్, చైన్‌మెన్ నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

వినోభానగర్‌లో టీబీ స్క్రీనింగ్ క్యాంప్



టీబీ మందులు పంపిణీ చేస్తూ..

లాలాపేట: టీబీ ముక్తభారత్ అభియాన్‌లో భాగంగా గురువారం లాలాపేట టీబీ యూనిట్ ఆధ్వర్యంలో వినోభానగర్‌లో టీబీ స్క్రీనింగ్ క్యాంప్ నిర్వహించారు. పలువురికి టీబీ పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా టీబీ సీనియర్ ట్రీట్మెంట్ సూపర్‌వైజర్ రాజు మాట్లాడుతూ కేవలం దగ్గు ఒక్కటే టీబీ లక్షణం కాదని, సాయంత్రం వేళలో జ్వరం రావడం, బరువు కోల్పోవడం, ఆకలి లేకపోడం, చాతిలో నొప్పి, అలసట వంటి మరి కొన్ని లక్షణాలు ఉన్నాయన్నారు. ఇలాంటి లక్షణాలు ఉన్న వారు వెంటనే లాలాపేటలోని టీబీ సెంటర్‌లో సంప్రదించి వైద్యం తీసుకోవాలన్నారు. క్రమం తప్పకుండా వైద్యం తీసుకుంటే టీబీని నయం చేసుకోవచ్చని సూచించారు. కార్యక్రమంలో వినోభా నగర్ సంక్షేమ సంఘం నాయకులు, వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

కిమ్స్ సన్‌షైన్‌లో అత్యాధునిక ఐకేర్ సెంటర్



ఐకేర్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న కిమ్స్ సన్‌షైన్ ఆస్పత్రి ఎండీ డాక్టర్ ఏవీ గురువారెడ్డి

సనత్‌నగర్: బేగంపేటలోని కిమ్స్ సన్‌షైన్ హాస్పిటల్‌లో ఆధునిక వైద్య సదుపాయాలతో కూడిన ఐకేర్ సెంటర్‌ను గురువారం ప్రారంభించారు. కిమ్స్ సన్‌షైన్ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ఏవీ గురువారెడ్డి, చీఫ్ ప్రసూతి, గైనకాలజిస్ట్ డాక్టర్ ఏ.భవానీ, డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఆప్తమాలజీ హెడ్ ఎస్‌టీఏస్ వృదు వ్యాస్ నేతృత్వంలో ఈ సెంటర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా గురువారెడ్డి మాట్లాడుతూ అన్ని రకాల వైద్య సేవలను ఒకే గొడుగు కిందకు తీసుకురావాలనే సంకల్పంతోనే ఆధునిక వైద్య సేవలతో కూడిన ఐకేర్ సెంటర్‌ను ప్రారంభించినట్లు తెలిపారు. కంటికి సంబంధించిన అన్ని రకాల వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని, కార్నియా, క్యాటరాక్ట్, రెటీనా, గ్లూకోమా వంటి విభాగాలకు చెందిన ఆధునిక వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని వృదు వ్యాస్ తెలిపారు. కార్యక్రమంలో హాస్పిటల్ సీఈఓ సుధాకర్‌జాదవ్, ఆప్తమాలజిస్టులు డాక్టర్ జ్యోతి, డాక్టర్ విష్ణుప్రీతి తదితరులు పాల్గొన్నారు.

ఓయూలో అక్రమంగా డబ్బుల వసూలు

ఇద్దరిని రిమాండ్‌కు తరలించిన పోలీసులు



లాలాపేట: విద్యార్థుల నుంచి అక్రమంగా డబ్బులు వసూలు చేస్తున్న ఇద్దరు వ్యక్తులను ఉస్మానియా యూనివర్సిటీ పోలీసులు అరెస్టు చేసి గురువారం రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బి.శివశంకర్(43), ఎస్.జగన్నాథ్(36) దాదాపు 14 ఏళ్ల నుంచి ఉస్మానియా యూనివర్సిటీ టెక్నాలజీ కళాశాలలో కంప్యూటర్ ఆపరేటర్లుగా పని చేస్తున్నారు. 8 నెలల నుంచి యూనివర్సిటీ అధికారులకు సంబంధం లేకుండా పలువురు విద్యార్థుల నుంచి ట్యూషన్ ఫీజు, మెస్ ఫీజుల పేరుతో దాదాపు రూ.3 లక్షల వరకు వసూలు చేశారు. ఈ మేరకు కళాశాల ప్రిన్సిపాల్ ఓయూ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వారిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

‘రీడింగ్’ పార్కు

పుస్తక థీమ్‌తో బీకేగూడ పార్కు అభివృద్ధి | పాఠకులను ఆకట్టుకుంటున్న ఉద్యానవనం | యోగా హాల్ సైతం ఏర్పాటు | ఒకవైపు ఆహ్లాదకర వాతావరణం.. | మరోవైపు విజ్ఞానాన్ని పంచే లైబ్రరీ.




పుస్తక ఆకారంలో బెంచీలు

పుస్తకం.. విజ్ఞానాన్ని పంచే మంచి స్నేహితుడు. పుస్తకం తోడుంటే చాలు.. ఆత్మవిశ్వాసం వెన్నంటే ఉన్నట్టే. పుస్తకం విలువను చాటిచెబుతూ జీహెచ్‌ఎంసీ ఏకంగా ఒక పార్కులో లైబ్రరీ వాతావరణాన్ని కల్పించింది. పుస్తకం ఆకారాన్ని పోలిన బెంచీలు.. చెట్టు చుట్టూ పాఠకులు కూర్చొనేందుకు వీలుగా నిర్మించిన ప్రత్యేక ప్లాట్‌ఫాం.. దానిపై బుక్స్‌ను స్టోర్ చేసుకునేందుకు బుక్‌బాక్స్.. అన్నింటికీ మించి చుట్టూ పచ్చటి లాన్.. ఆ పక్కనే యోగా హాల్.. ఇలా వైవిధ్యంగా, పుస్తక థీమ్‌లో రూపుదిద్దుకున్న బీకేగూడ పార్కు సందర్శకులను కట్టిపడేస్తోంది. – సనత్‌నగర్



పార్కులో నిర్మించిన యోగా షెడ్డు

దాదాపు రూ.20 లక్షలు ఖర్చు చేసి పుస్తక థీమ్‌తో ఈ పార్కును రీడెవలప్‌మెంట్ చేశారు. ఒకవైపు విజ్ఞానాన్ని పంచేందుకు లైబ్రరీ, మరోవైపు ఆరోగ్యాన్ని ప్రసాదించేలా యోగా హాల్ నిర్మించారు. ఒకప్పుడు కేవలం కొంతసేపు సేదతీరేందుకే అన్నట్లు ఉండే ఈ పార్కు ఇప్పుడు అటు విజ్ఞానం, ఇటు ఆరోగ్యం అందించేలా తీర్చిదిద్దడంతో స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే ఈ పార్కులో పలు యోగా సంస్థలు ఉచితంగా శిక్షణ అందించేందుకు ముందుకువచ్చాయి. ప్రత్యేక హాల్ లేకపోవడంతో పచ్చటి బయళ్ల నడుమ యోగా చేసుకునే క్రమంలో వర్షాకాలంలో ఇబ్బందికర పరిస్థితులు తలెత్తుతున్నాయి. ఈ క్రమంలో పార్కుకు ఒకవైపు యోగా హాల్‌ను నిర్మించడం కాలమేదైనా యోగ శిక్షణకు ఎలాంటి ఆటంకం లేకుండా ఉంటుందని యోగా సాధకులు పేర్కొంటున్నారు. ఇక సీనియర్ సిటిజన్స్‌తో పాటు మహిళలు, యువత పుస్తకాలు చదువుకుంటూ విజ్ఞానాన్ని సంపాదించుకోవాలన్నా ఇప్పుడు ఈ పార్కు వేదికగా మారింది. తమకు నచ్చిన పుస్తకాలు చదువుకుంటూ ప్రకృతి నడుమ సేదదీరే భాగ్యాన్ని ఇక్కడి సందర్శకులకు కల్పించారు. ఎస్సార్‌నగర్, బీకేగూడ పరిసర ప్రాంత నివాసితులు ఎక్కువగా కంజర్ల లక్ష్మీనారాయణయాదవ్ పార్కుకు వెళ్తుంటారు. అయితే అక్కడ వాకర్స్, సందర్శకుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతుండటంతో అసౌకర్యంగా ఉంటుంది. ఈ క్రమంలో ఈ పార్కు అభివృద్ధితో ఆయా ప్రాంతాల వాకర్స్, సందర్శకులకు మరింత అందుబాటులోకి వచ్చినట్లయ్యింది. కేవలం వాకింగ్ చేసుకోవడమే కాకుండా యోగ, రీడింగ్ జోన్ కూడా అందుబాటులో ఉండడంతో తమ అభిరుచులను నెరవేర్చుకునే అవకాశం దొరికింది. ఏదేమైనా ఇక్కడ పుస్తక ఆకృతిలో నిర్మించిన బెంచీలు, రీడింగ్ జోన్ పేరిట చెట్టు చుట్టూ ఏర్పాటు చేసిన లైబ్రరీ వేదిక పుస్తక ప్రియులను విశేషంగా ఆకట్టుకుంటోంది.





పుస్తకాలు చదువుకునేందుకు వీలుగా చెట్టు చుట్టూ ఏర్పాటు చేసిన ప్లాట్‌ఫాం, చిత్రంలో పుస్తకాలు ఉంచే బుక్‌బాక్స్

త్వరలో ప్రారంభం

సుమారు రూ.20 లక్షల వ్యయంతో పుస్తక థీమ్‌తో అభివృద్ధి చేసిన ఈ పార్కును అతి త్వరలో ప్రారంభించనున్నాం. అలాగే ఇక్కడ కొత్తగా నిర్మించిన యోగా హాల్‌ను కూడా సాధకులకు అంకితం చేయనున్నాం. ప్రస్తుతం కొద్దిపాటి పుస్తకాలు పెట్టుకునేందుకు వీలుగా రీడింగ్ పేరిట బుక్‌బాక్స్‌ను ఏర్పాటు చేశాం. భవిష్యత్తులో ఆదరణను బట్టి మరింతగా విస్తృతం చేసే అవకాశం ఉంది. అలాగే ఎప్పటికప్పుడు సరికొత్తగా వచ్చే పుస్తకాలను అందుబాటులోకి తీసుకువచ్చే ప్రయత్నం చేస్తాం.

– సాయిసందీప్, జీహెచ్‌ఎంసీ ఖైరతాబాద్ సర్కిల్ డీఈ

రాజునాయక్‌కు డాక్టరేట్



ఉస్మానియాయూనివర్సిటీ: ఓయూ పొలిటికల్ సైన్స్ విభాగం విద్యార్థి వడిత్యా రాజునాయక్‌కు పీహెచ్‌డీ డాక్టరేట్ డిగ్రీ లభించింది. ప్రొఫెసర్ బ్రహ్మానందం పర్యవేక్షణలో ట్రైబల్ డెవలప్‌మెంట్ అండ్ నాన్ గవర్నమెంట్ ఆర్గనైజేషన్: ఏ స్టడీ ఆఫ్ మహబూబ్‌నగర్ డిస్ట్రిక్ట్ ఇన్ తెలంగాణ స్టేట్ అనే అంశంపై పరిశోధనకు డాక్టరేట్ లభించింది. ఎంఏ, బీఈడీతో పాటు లైబ్రరీ సైన్స్ చదివిన రాజునాయక్ తెలంగాణ ఉద్యమంలో విద్యార్థి జేఏసీలో చురుకైన పాత్ర పోషించినట్లు తెలిపారు.

నేడు బదిలీపై వెళ్లనున్న డీసీ సుభాష్‌రావు



సికింద్రాబాద్: జీహెచ్‌ఎంసీ సికింద్రాబాద్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ డి.సుభాష్‌రావు శుక్రవారం బదిలీపై వెళ్లనున్నారు. ఇటీవలి కమిషనర్ల బదిలీల్లో ఇక్కడి డీసీ సుభాష్‌రావును జహీరాబాద్ మున్సిపల్ కమిషనర్‌గా బదిలీ చేశారు. అయితే ఇంకా కొత్త డిప్యూటీ కమిషనర్‌ను మాత్రం నియమించలేదు. సుభాష్‌రావు రిలీవ్ అయిన వెంటనే కొత్త కమిషనర్ నియామకం లేదా ఇన్‌చార్జి డీసీ నియామకం ప్రక్రియ పూర్తి చేయనున్నట్లు జోనల్ కార్యాలయ అధికారులు తెలిపారు.

ఓల్డ్‌కస్టమ్స్ బస్తీ సమస్యల పరిష్కారానికి కృషి



బేగంపేట ఓల్డ్‌కస్టమ్స్‌బస్తీలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్



జయనగర్‌లో పర్యటిస్తున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్


సనత్‌నగర్: బేగంపేట ఓల్డ్‌కస్టమ్స్‌బస్తీలోని సమస్యలను పరిష్కరించే విధంగా కృషి చేస్తానని మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. బేగంపేట డివిజన్‌లోని ఓల్డ్‌కస్టమ్స్ బస్తీలో గురువారం అధికారులతో కలిసి ఆయన పాదయాత్ర చేశారు. ప్రధానంగా బస్తీలో రోడ్లు, సీవరేజీ సమస్య గురించి స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. రోడ్లు అధ్వాన్నంగా మారాయని, సీవరేజీ లైన్ సక్రమంగా లేకపోవడం వల్ల వర్షం కురిస్తే రోడ్లపై నీరు నిలిచిపోతుందని స్థానికులు వివరించారు. బస్తీలో పలుచోట్ల విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలని, కమ్యూనిటీ హాల్ అదనపు అంతస్తు నిర్మించాలని కోరారు. స్పందించిన ఆయన అవసరమైన చోట్ల నూతన రోడ్ల నిర్మాణం, సీవరేజీ లైన్ల ఏర్పాటు కోసం వెంటనే ప్రతిపాదనలు రూపొందించాలని అధికారులను ఆదేశించారు. అంతకుముందు బ్రాహ్మణవాడీ లేన్ నంబర్-1లో రూ.8 లక్షలు, మెయిన్‌రోడ్డులో రూ.13 లక్షలతో చేపట్టనున్న సీవరేజీ పైప్‌లైన్ నిర్మాణ పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ టి.మహేశ్వరి, ఈఈ సుబ్రహ్మణ్యం, వాటర్‌వర్క్స్ డీజీఎం ఆశిష్, బీఆర్‌ఎస్ నాయకులు శ్రీనివాస్‌గౌడ్, శ్రీహరి, శేఖర్, ఆరీఫ్, అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

జయనగర్‌లో పర్యటన

బన్సీలాల్‌పేట్: బన్సీలాల్‌పేట్ డివిజన్ జయనగర్‌లో ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ గురువారం స్థానిక కార్పొరేటర్ కె.హేమలత, వెంకటేషన్ రాజు, వివిధ ప్రభుత్వ విభాగాల అధికారులతో కలిసి గురువారం పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికులు సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి నిర్మాణాత్మకమైన కార్యక్రమాలతో ముందుకు సాగుతున్నామని చెప్పారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఏడీఈ మహేష్‌కుమార్, ఈఈ సుబ్రహ్మణ్యం, డిప్యూటీ ఈఈ ఆంజనేయులు, లక్ష్మీపతి, ఏసూరి మహేష్, శ్రీకాంత్‌రెడ్డి, శివ, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

రైల్వే ఆస్పత్రిలో కార్డియాక్ క్యాత్ ల్యాబ్

ప్రారంభించిన దక్షిణ మధ్య రైల్వే జీఎం అరుణ్‌కుమార్ జైన్



కార్డియాక్ క్యాత్ ల్యాబ్ను ప్రారంభిస్తున్న రైల్వే జీఎం ఏకే జైన్

అడ్డగుట్ట: లాలాగూడలోని సెంట్రల్ రైల్వే హాస్పిటల్‌లో గురువారం కార్డియాక్ క్యాత్ ల్యాబ్, అడ్వాన్స్‌డ్ కార్డియాక్ యూనిట్‌ను దక్షిణ మధ్య రైల్వే జీఎం అరుణ్‌కుమార్ జైన్ ప్రిన్సిపల్ చీఫ్ మెడికల్ డైరెక్టర్ డాక్టర్ నిర్మలా రాజారాం, హైదరాబాద్ డివిజన్ డీఆర్‌ఎం లోకేష్ బిష్ణోయ్‌లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జీఎం ఏకే జైన్ మాట్లాడుతూ రైల్వే ఉద్యోగులు, వారి కుటుంబాల ఆరోగ్య సంరక్షణకు సంబంధించిన మౌలిక సదుపాయాలను బలోపేతం చేసే దిశగా ఈ కొత్త సౌకర్యం ఒక ప్రధాన అడుగు అని అన్నారు. ఈ చొరవ దక్షిణ మధ్య రైల్వేకు తన సిబ్బంది శ్రేయస్సు పట్ల ఉన్న నిబద్ధతను ప్రతిబింబిస్తుందని పేర్కొన్నారు. గుండె సంబంధిత రోగులకు యాంజియోగ్రామ్‌లు, యాంజియో ప్లాస్టీలు నిర్వహించడానికి, సకాలంలో చికిత్స అందించడానికి ఈ ల్యాబ్ ఉపయుక్తంగా ఉంటుందన్నారు. అడ్వాన్స్‌డ్ కార్డియాక్ యూనిట్‌లో ఆధునిక కార్డియాక్ ఇంటెన్సివ్ కేర్ యూనిట్ (ఐసీయూ)తోపాటు కార్డియో థొరాసిక్ ఆపరేషన్ థియేటర్(ఓటీ) ఒకేచోట ఉండటం వల్ల పూర్తిస్థాయి కార్డియాక్ సంరక్షణను అందజేస్తాయని వివరించారు. లాలాగూడలోని సెంట్రల్ హాస్పిటల్ భారతీయ రైల్వేల్లో క్యాత్ ల్యాబ్ కలిగి ఉన్న నాల్గవ ఆసుపత్రిగా నిలిచిందన్నారు. కార్యక్రమంలో సెంట్రల్ హాస్పిటల్ మెడికల్ డైరెక్టర్ డాక్టర్ ఐ.శివనాగప్రసాద్, చీఫ్ స్టాఫ్ సర్జన్‌లు (కార్డియాలజిస్ట్) డాక్టర్ ఎన్వీబీకే సాయి, కృష్ణవేణి, ఇతర సీనియర్ అధికారులు, గుర్తింపు పొందిన ట్రేడ్ యూనియన్ల ప్రతినిధులు పాల్గొన్నారు.

మహంకాళి అమ్మవారి హుండీ ఆదాయం రూ.26.54 లక్షలు

రాంగోపాల్‌పేట్: సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి అమ్మవారి హుండీ ద్వారా రూ.26,54,669 ఆదాయం లభించింది. దేవాలయంలో ఈవో గుత్తా మనోహర్‌రెడ్డి, పెరుమాళ్ వెంకటేశ్వర స్వామి దేవాలయ ఈవో సత్యమూర్తి, దేవాలయ అనువంశిక ధర్మకర్త సురిటి రామేశ్వర్ తదితరుల ఆధ్వర్యంలో హుండీని గురువారం లెక్కించారు. నగదుతో పాటు 1,095 గ్రాముల బంగారం, 10.5 కిలోల వెండి లభించింది.

సమస్యలపై వాటర్‌వర్క్స్ అధికారులకు వినతి



వినతి పత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు శ్రీనివాస్, సురేష్

పద్మారావునగర్: బన్సీలాల్‌పేట్ డివిజన్‌లో ప్రజా సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బీజేపీ నాయకులు జలమండలి అధికారులకు గురువారం వినతి పత్రం అందజేశారు. బీజేపీ సీనియర్ నాయకులు, ఐడీహెచ్ కాలనీ అధ్యక్షుడు అంగముత్తు శ్రీనివాస్ ఆధ్వర్యంలో బీజేపీ నాయకులు వై.సురేష్ కుమార్, కృష్ణ, కిరణ్‌కుమార్, సాయిచక్రపాణి తదితరులు కలిసి మారేడ్‌పల్లి డివిజన్ జలమండలి అధికారులను కలిసి వినతి పత్రం సమర్పించారు. ఐడీహెచ్ కాలనీ, బోయిగూడ, బోలక్‌పూర్, బన్సీలాల్‌పేట్ ప్రాంతాల్లో మురుగు పారుతుండటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. అదేవిధంగా పలు ప్రాంతాల్లో నీటి ఎద్దడి కారణంగా అవస్థలు పడుతున్నామని వినతి పత్రంలో పేర్కొన్నారు. ఆయా సమస్యలపై కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి లేఖను అధికారులకు అందజేశారు.

నేడు కరెంటు ఉండని ప్రాంతాలు

సనత్‌నగర్: జనప్రియ, బేగంపేట్, మైత్రీవనం, ఆల్విన్ సబ్‌స్టేషన్ల పరిధిలోని విద్యుత్ ఫీడర్ లైన్ల మరమ్మతుల కారణంగా శుక్రవారం పలు ప్రాంతాల్లో కరెంటు సరఫరా ఉండదని గ్రీన్‌ల్యాండ్స్ సీబీడీ ఏడీఈ చరణ్‌సింగ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు అవంతినగర్, పీఆర్‌నగర్, న్యూ శాస్త్రీనగర్, డీకేరోడ్డు, మాజీగవర్నర్ రోశయ్య లేన్, శివబాగ్‌కాలనీ, ఆదిత్యబ్లాక్, ఆదిత్య వింధ్య బ్లాక్, కుమ్మరి బస్తీ, ఇమ్రోజ్ హోటల్ లేన్, ఆనంద్ బజార్ లేన్, జీన్స్ కార్నర్, కాకతీయ మెస్, డెల్టా ఛాంబర్స్, అమీర్‌పేట మెయిన్‌రోడ్డు, గవర్నమెంట్ హాస్పిటల్ మెయిన్‌రోడ్డు, హోండా షోరూం లేన్, అమోఘ జూనియర్ కాలేజ్, అభిరుచి లేన్, బల్కంపేట మెయిన్‌రోడ్డు, సోనీ వైన్స్ వెనుక ప్రాంతం, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సుందర్‌నగర్ ఫైర్ స్టేషన్, పోలీస్ క్వార్టర్స్, 3ఆర్‌టీ, ఫతేబాగ్, సనత్‌నగర్ మెయిన్‌రోడ్డు, బంజారానగర్, ఓల్డ్ అండ్ న్యూ శాస్త్రినగర్, పీఆర్ నగర్, ఓల్డ్ సుల్తాన్‌నగర్, ఇండస్ట్రియల్ లేన్, శ్రీముఖి అపార్ట్‌మెంట్స్ ప్రాంతాల్లో విద్యుత్ కోత ఉంటుందని పేర్కొన్నారు.

రాంగోపాల్‌పేట్: చిలకలగూడ, బన్సీలాల్‌పేట్ సబ్‌స్టేషన్ల పరిధిలోని ఫీడర్ల మరమ్మతుల కారణంగా శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సీబీడీ ఏడీఈ ఆదినారాయణరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1గంట వరకు ప్రాగాటూల్స్ ఫీడర్ పరిధిలోని హర్షిత రెసిడెన్సీ, భోలక్‌పూర్, మేకలమండి, మల్లికార్జున టెంపుల్, మంత్రాల బాలయ్య ప్రాంతాల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5గంటల వరకు నాగన్నకుంట ఫీడర్ పరిధిలోని హనుమాన్ టెంపుల్, నాగన్నకుంటలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని తెలిపారు.

మరమ్మతుల కారణంగా..

రసూల్‌పురా: సికింద్రాబాద్ డివిజనల్ బాలంరాయి, సిఖ్ విలేజ్ 11 కేవీ ఫీడర్ల పరిధిలో ఫీడర్ల మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు సికింద్రాబాద్ ఏడీఈ కే.మురళీకృష్ణ ఓ ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఉదయం 9.30 నుంచి 12.30 గంటల వరకు బాలంరాయి. హ్యాపీ ఎన్‌క్లేవ్, పైగా కాలనీ, విమాననగర్, మార్గదర్శికాలనీ, లక్ష్మిగుంటి కాలనీ, 40 క్వార్టర్స్ పరిసర ప్రాంతాలు.. అదేవిధంగా బాంటీయా ఫర్నిచర్, క్లాసిక్ గార్డెన్, అంబేడ్కర్‌నగర్, శివాలయం రోడ్, బాలంరాయి పరిసర ప్రాంతాల్లో మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు కరెంటు సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

మహంకాళి అమ్మవారిని దర్శించుకున్న కోట నీలిమ



రాంగోపాల్‌పేట్: సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి అమ్మవారిని టీపీసీసీ ఉపాధ్యక్షురాలు డాక్టర్ కోట నీలిమ దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆమె గురువారం అమ్మవారిని దర్శించుకున్న అనంతరం వచ్చే నెలలో జరగనున్న బోనాల జాతర ఏర్పాట్ల గురించి సిబ్బంది, అధికారులను అడిగి తెలుసుకున్నారు. లక్షల మంది భక్తులు పాల్గొనే ఈ బోనాల జాతరలో స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు అందరు సమష్టిగా పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. అలాగే తమ పార్టీ నాయకులు, కార్యకర్తలు కూడా జాతరను విజయవంతం చేసేందుకు తమవంతు పాత్ర జాతరలో పోషిస్తారన్నారు. కాంగ్రెస్ పార్టీ ఏ బ్లాక్ అధ్యక్షుడు త్రికాల మనోజ్‌కుమార్ ముదిరాజ్, నాయకులు శ్రీకాంత్‌చారి, రాజ్‌కుమార్, ఈశ్వర్, ఎల్లేష్, మాణిక్యం ప్రభు, హేమంత్‌సింగ్ ఠాకూర్, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

బల్కంపేట ఎల్లమ్మ కల్యాణోత్సవానికి ఆహ్వానం



ఆహ్వాన పత్రికను ఎమ్మెల్యేకు అందజేస్తున్న ఆలయ అధికారులు

సనత్‌నగర్: బల్కంపేట ఎల్లమ్మ అమ్మవారి కల్యాణానికి సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్‌కు ఆహ్వానం అందజేశారు. ఈ మేరకు వెస్ట్‌మారేడ్‌పల్లిలోని కార్యాలయంలో ఆలయ అధికారులు ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను గురువారం కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. ఆలయ పండితులు వేదమంత్రాలతో ఆశీర్వచనం చేసి ప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమ్మవారి కల్యాణానికి వచ్చే భక్తులు ఎలాంటి ఇబ్బందులకు గురికాకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. మాజీ కార్పొరేటర్ శేషుకుమారి, ఆలయ ట్రస్టీ చైర్మన్ సాయిబాబాగౌడ్, ఈఓ మహేందర్‌గౌడ్, సూపరింటెండెంట్ హైమావతి, బీఆర్‌ఎస్ నాయకులు అశోక్‌యాదవ్, కూతురు నర్సింహ, బలరాం, వనం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకుందాం



మాట్లాడుతున్న ఏసీపీ సైదయ్య

రాంగోపాల్‌పేట్: బోనాల ఉత్సవాలు, జగన్నాథ స్వామి రథయాత్ర తదితర పండగలను ప్రశాంతంగా జరుపుకునేలా ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలని మహంకాళి ఏసీపీ సైదయ్య అన్నారు. మార్కెట్ పోలీస్ స్టేషన్‌లో ఆయన పీస్ కమిటీ సభ్యులతో సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఏడాది బోనాల ఉత్సవాలు ఎంతో వైభవంగా నిర్వహిస్తారని, అన్ని వర్గాల ప్రజలు ఈ ఉత్సవాలకు సహకరించే ఆనవాయితీ ఉందని, దాన్ని అలాగే కొనసాగించాలని చెప్పారు. మద్యం తాగి గొడవలకు దిగితే పోలీసులు కఠినంగా వ్యవహరించాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఫలహార బండ్ల ఊరేగింపు ప్రశాంతంగా సాగేలా చూడాలన్నారు. ఊరేగింపుల్లో డీజేలకు ఎలాంటి అనుమతులు లేవని, అలా ఎవరైనా పెడితే సీజ్ చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ రాంచందర్, డీఐ షాకీర్ అలీ, ఎస్సైలు గిరిధర్ తదితరులు పాల్గొన్నారు.

అన్ని ప్రాంతాల్లో సీసీ రోడ్లు వేయిస్తాం



సనత్‌నగర్: డివిజన్ పరిధిలోని అన్ని బస్తీలు, కాలనీల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నట్లు సనత్‌నగర్ కార్పొరేటర్ కొలను లక్ష్మీబాల్‌రెడ్డి అన్నారు. డివిజన్ పరిధిలోని దాసారం బస్తీ నల్లపోచమ్మ ఆలయం నుంచి బెంగళూరు అయ్యంగార్ బేకరీ వరకు, అలాగే మాతా టెంట్‌హౌస్ వెనుక వరకు రూ.31 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు నిర్మాణ పనులను గురువారం కార్పొరేటర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ చొరవతో గత బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో ఈ పనులకు శంకుస్థాపన జరిగిందని, ప్రస్తుతం పనులు ప్రారంభించినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఏఈ జమీల్, భాస్కర్, బీఆర్‌ఎస్ నాయకులు కొలను బాల్‌రెడ్డి, ఖలీల్‌బేగ్, షాబాద్ శ్రీనివాస్, నాగరాజు, విజయ్‌సింగ్, నజీర్, పురుషోత్తం, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి అండగా ఉంటాం

బీజేపీ నాయకులు మర్రి పురురవరెడ్డి



బాధితురాలు లక్ష్మీకి నిత్యావసర సరుకులు అందజేస్తున్న మర్రి పురురవరెడ్డి

పద్మారావునగర్: బన్సీలాల్‌పేట్ డివిజన్ హమాల్‌బస్తీలో విద్యుత్తు ప్రమాద బాధితులకు బీజేపీ నాయకులు గురువారం నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు. ఇటీవల విద్యుదాఘాతం కారణంగా హమాల్‌బస్తీకి చెందిన లక్ష్మీ ఇంట్లోని విలువైన వస్తువులు, పిల్లల సర్టిఫికేట్స్, ఇతరత పత్రాలు దగ్ధమయ్యాయి. విషయం తెలుసుకున్న బీజేపీ నాయకులు మర్రి పురురవరెడ్డి లక్ష్మీ కుటుంబాన్ని పరామర్శించి నిత్యావసర సరుకులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఘటన దురదృష్టకరమన్నారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ద్వారా ఆర్థిక సహాయం అందించడానికి చర్యలు తీసుకుంటామన్నారు. కాలిపోయిన పిల్లల సర్టిఫికెట్లు ఇప్పించడానికి కృషి చేస్తున్నామని హామీ ఇచ్చారు. బీజేపీ నాయకులు శ్రీకాంత్, మహంకాళి సికింద్రాబాద్ జిల్లా కౌన్సిల్ సభ్యులు గుంటి సత్యనారాయణ, పార్శి పరమేష్, కె.శ్రావణ్, వికాస్, పిట్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.